# పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు




నామినేషన్ కేంద్రంను పరిశీలించి రిటర్నింగ్ ఆఫీసర్ ఎస్ రాజును వివరాలు అడిగి తెలుసుకుంటున్న కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి

- పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి
- హుజూరాబాద్ నామినేషన్ కేంద్రం పరిశీలన

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 8: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ స్టేషన్ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి తెలిపారు. బుధవారం హుజూరాబాద్ పట్టణం కేసీక్యాంప్‌లోని నామినేషన్ కేంద్రాన్ని సీపీ సందర్శించారు. ఆర్వో, ఆర్డీవో ఎస్ రాజు, ఇతర సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పర్కాల క్రాస్‌రోడ్‌లోని అంతర జిల్లా చెక్‌పోస్ట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కమిషనరేట్ వ్యాప్తంగా శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా పోలీస్ శాఖ పరంగా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టామని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు జరిగేలా పోలీస్ అధికారులు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. చెక్ పోస్టుల వద్ద విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అలసత్వం ప్రదర్శిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలను పర్యవేక్షించేందుకు నిరంతరం అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గ కేంద్రాన్ని పరిశీలించి మానిటరింగ్ చేస్తున్నట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద తగిన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట రిటర్నింగ్ ఆఫీసర్ ఎస్ రాజుతో పాటు హుజూరాబాద్ ఏసీపీ లక్కిరెడ్డి జీవన్‌రెడ్డి, టౌన్, రూరల్ సీఐలు బొల్లం రమేశ్, బీ సంతోష్‌కుమార్ తదితరులున్నారు.

# ఈటల ఓటమి ఖాయమైంది..!



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్

- రాజకీయ భవిష్యత్తు ఇచ్చిన కేసీఆర్‌పై పోటీ చేయడం ఆయన అహంకారానికి పరాకాష్ట
- ప్రజలు కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారు
- బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 8: రాజకీయ భవిష్యత్తు ఇచ్చిన బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేయడమేకాక ఆయనపైనే పోటీ చేయడం ఈటల రాజేందర్ అహంకారానికి పరాకాష్ట అని బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ దుయ్యబట్టారు. హుజూరాబాద్, గజ్వేల్‌లో రెండు చోట్ల రెండు చోట్ల పోటీ చేయడమంటేనే ఈటల ఓటమి ఖాయమైందని అర్థమని పేర్కొన్నారు. బుధవారం సిటీ సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత ఉప ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి పోటీ చేసిన ఈటల రాజేందర్ ప్రజల్లో సెంటిమెంట్ రెచ్చగొట్టి, కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేగా గెలిచాక నియోజకవర్గం అభివృద్ధిని గాలికి వదిలేశారని ఆరోపించారు. అప్పటిలాగే ఇప్పుడు కూడా ఎన్నికల్లో మోసం చేయాలని చూస్తే ప్రజలు రెండోసారి మోసపోయేందుకు సిద్ధంగా లేరన్నారు. అంతేకాక రాజకీయ భవిష్యత్తు ఇచ్చిన సీఎం కేసీఆర్‌పైనే పోటీ చేస్తూ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్న ఈటల తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. గెలవననే భయంతోనే ఈటల రెండు చోట్ల పోటీ చేస్తున్నారని శ్రీనివాస్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. ఎన్నికల ముందే ఆ పార్టీ అధినేత రేవంత్‌రెడ్డి రైతులకు మూడు గంటల కరెంటు చాలు అని ముందస్తు సంకేతం ఇవ్వడం ప్రజల మనసులో నాటుకుపోయిందని చెప్పారు. 24 గంటల ఉచిత కరెంటు ఇచ్చే బీఆర్ఎస్ పార్టీని రైతులు, రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో 100కు పైగా సీట్లలో బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు రాష్ట్ర అభివృద్ధికి పాటుపడే బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వర్దినేని రవీందర్‌రావు, పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు మొలుగూరి ప్రభాకర్, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ తులసి లక్ష్మణమూర్తి, నాయకులు ఆర్కే రమేశ్, చందమల్ల బాబు, సోమన్న, అన్నయ్యలింగం, మోరే మధు, దుబాసీ బాబు, జే సందీప్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం రవాణాపై ఉక్కుపాదం

- హుజూరాబాద్ ఎక్సైజ్ సీఐ దుర్గాభవాని



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ దుర్గాభవాని

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 8: ఎన్నికల నేపథ్యంలో హుజూరాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని హుజూరాబాద్, సైదాపూర్, శంకరపట్నం మండలాల్లో అక్రమ మద్యం నిలువలు, గుడుంబా తయారీపై ఉక్కుపాదం మోపుతున్నామని ఎక్సైజ్ సీఐ జీ దుర్గాభవాని తెలిపారు. బుధవారం పట్టణంలో వాహనాల తనిఖీ నిర్వహించిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ మొదలుకొని ఇప్పటివరకు అక్రమ మద్యం నిలువలు, గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం పానకం రవాణా, బెల్టుషాపులపై 186 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 611 లీటర్ల మద్యం, 22 లీటర్ల బీర్లు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లోనూ ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెక్‌పోస్టుల్లోనే కాకుండా మండల సరిహద్దుల్లో వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా ఎక్కడైనా అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపినా, నిల్వ చేసినా వెంటనే ఎక్సైజ్ సీఐ సెల్ నంబర్ 8712658811 లేదా కంట్రోల్ రూమ్ సెల్ 8019263862కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

## ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి

- జమ్మికుంట ఎక్సైజ్ సీఐ ఎండీ అక్బర్ హుస్సేన్



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ అక్బర్ హుస్సేన్

జమ్మికుంట, నవంబర్ 8: ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని, అక్రమ మద్యం రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని జమ్మికుంట ఎక్సైజ్ సీఐ ఎండీ అక్బర్ హుస్సేన్ హెచ్చరించారు. బుధవారం జమ్మికుంట ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత ఎక్సైజ్ శాఖ కరీంనగర్ డిప్యూటీ కమిషనర్, జిల్లా ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని మూడు మండలాలైన జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాల్లో అక్రమంగా మద్యం, నాటుసారా అమ్ముతున్న, అమ్మిన వ్యక్తులపై 184 కేసులు నమోదు చేశామని తెలిపారు. అంతేకాకుండా 190లీటర్ల నాటుసారా, 28,444 లీటర్ల బెల్లం పానకం, 576 కిలోల బెల్లం, 278 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. మూడు మండలాల్లో అక్రమ మద్యం, నాటు సారా అమ్మకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా 130 మందిని ఆయా మండలాల్లోని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలు కఠినంగా ఉంటాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా అక్రమంగా మద్యం, నాటుసారా అమ్మినట్లైతే టోల్ ఫ్రీ నంబర్ 8019263862, 1800-425-2523 లేదా, సీఐ నంబర్ 8712658812కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని, ప్రజలు ఎక్సైజ్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇల్లందకుంట, నవంబర్ 8: రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా హార్టికల్చర్ అధికారి, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని పరిశీలించి, ఏవోను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడ్‌కు రూ.2203, బీ గ్రేడ్‌కు రూ.2180 చొప్పున ధర చెల్లిస్తున్నారని తెలిపారు. నిర్ణీత తేమశాతం వచ్చేలా ధాన్యాన్ని ఇంటి వద్దనే ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. రైతులు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇక్కడ ఏవో గుర్రం రజిత, రైతులు ఉన్నారు.



ఇల్లందకుంటలో ధాన్యం కొనుగోళ్లపై ఏవో రజితను వివరాలు అడుగుతున్న జిల్లా హార్టికల్చర్ అధికారి, మండల ప్రత్యేకాధికారి బండారి శ్రీనివాస్

## చట్టాలపై విద్యార్థులకు అవగాహన

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 8: హుజూరాబాద్ పట్టణంలోని శాతవాహన పాఠశాలలో బుధవారం బ్లూకోల్ట్స్ పోలీసులు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజంలో పౌరులు తమ బాధ్యతను ఎరిగి మెదలాలన్నారు. మన వీధిలో, మనకు తెలిసిన ప్రాంతంలో దొంగతనాలు జరిగితే వెంటనే డయల్ -100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే ఎలాంటి సమస్య వచ్చినా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పరిష్కారం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వీ వెంకటేశ్వర్లు, బ్లూకోల్ట్స్ పోలీసులు షౌకత్ అలీ, కుమార్, రఫీక్, శ్రీనివాస్, పలువురు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పశువైద్య శిబిరం

తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 8: మండలంలో పోరండ్ల, మల్లాపూర్ గ్రామాల్లో బుధవారం కరీంనగర్ ప్రాంతీయ పశు సంవర్ధక శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో పాడి పశువుల గర్భకోశ సమస్యల నివారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 80 ఆవులు, 65గేదెలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా 100మంది రైతులు లబ్ధిపొందినట్లు మండల పశు వైద్యాధికారి సురేందర్ రెడ్డి తెలిపారు. శిబిరంలో శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ లింగారెడ్డి, డాక్టర్ విజయ్ కుమార్ శర్మ, డాక్టర్ ఎస్‌పీ రెడ్డి డాక్టర్ రాజిరెడ్డి, శిక్షణ కేంద్రం అధ్యాపకులు డాక్టర్ ఎం కోటేశ్వరరావు, డాక్టర్ సాయి చైతన్య, డాక్టర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఐకి సన్మానం



మొలంగూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్ఆర్ఐ దాత రఘుపతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

శంకరపట్నం, నవంబర్ 8: మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్ఆర్ఐ దాత బూర్ల రఘుపతిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. మొలంగూర్‌కు చెందిన రఘుపతి ఇండియాకు వచ్చిన ప్రతిసారి తన దాతృత్వాన్ని చాటుతున్నారు. తాజాగా, ఆయన మొలంగూర్ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలకు ప్రింటర్ అవసరమని తెలుసుకుని నూతన ప్రింటర్ ఇవ్వడానికి ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా రఘుపతిని స్కూల్ హెచ్ఎం నీరజ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అలాగే రిటైర్డ్ పీఈటీ బూర్ల లక్ష్మీనారాయణను కూడా ఘనంగా సన్మానించారు. ఇక్కడ విద్యార్థులు పాల్గొన్నారు.